ప్రజాశక్తి
మంగళవారం 3 జూన్ 2025 | 5 | అనంతపురం

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్కుమార్

ప‘రేషన్’

◆ ఎండియు వాహనాల్లేక అవస్థలు ◆ రేషన్షాపుల వద్ద పడిగాపులు

రాష్ట్ర ప్రభుత్వం రేషన్ పంపిణీలో తీసుకొచ్చిన మార్పులు ప్రజలకు తీవ్రమైన ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇదివరకు ఎండియు వాహనాల ద్వారా ఇళ్ల వద్దకు వచ్చి పంపిణీ చేసేవారు. ఈ విధానానికి కూటమి ప్రభుత్వం స్వస్తి పలికింది. పాత పద్ధతిలోనే పంపిణీ చేపట్టాలని నిర్ణయించింది. ఈ నెల ఒకటవ తేదీ నుంచి అమల్లోకి తీసుకువచ్చింది. ప్రజలు రేషన్ షాపుల వద్ద బారులు దీరి నిలబడుతున్నారు. సర్వర్ సమస్యలు దీనికి తోడవడంతో రోజుల తరబడి రేషన్ షాపుల వద్ద పడిగాపులు గాయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో 1645 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 6,67,308 రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రతినెలా సగటున పదివేల మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ జరుగుతుంది. ఇవే కాకుండా అంగన్వాడీ కేంద్రాలకు కూడా పంపిణీ వీటి ద్వారానే జరుగుతూ వచ్చింది. ప్రతినెల 1వ తేదీ నుంచి 17వ తేదీ మధ్యలో పంపిణీ జరుగుతూ ఉండేది. జిల్లా వ్యాప్తంగా మొత్తంగా 405 మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్స్ వాహనాల ద్వారా ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ జరుగుతూ వచ్చేది.

వృద్ధురాలు మృత్యువాత

అనంతపురంలోని ఓ రేషన్ షాపు వద్ద రేషన్ షాపు వద్ద పడిగాపులు గాచి ఓ వృద్ధురాలు ఆదివారం నాడు మరణించింది. అనంతపురం నగరంలోలో నిర్మలానంద నగర్లో లక్ష్మీదేవి అనే వృద్ధురాలు ఆదివారం ఉదయం నుంచి ఎండలో రేషన్ కోసం వేచి చూస్తే క్రమంలోనే ఆమె స్పృహ తప్పి గుర్తించినట్టు స్థానికులు చెప్పున్నారు. ఇదే క్రమంలోనే ఆమె మరణించింది.

కూటమి రాకతో ఎండియు వాహనాలు బంద్

రేషన్ దుకాణాల్లో పంపిణీ చేయడం ద్వారా వస్తున్న కొత్త సమస్యల్లో బయోమెట్రిక్ పరికరాల సమస్య తీవ్రంగా ఉంది. ఇదివరకు ఎండియు వాహనాల్లో పంపిణీ చేస్తుండడంతో వాహనానికి ఒకటి చొప్పున బయోమెట్రిక్ పరికరం ఉండేది. ఇప్పుడు ఆ వాహనాలు లేకుండా నేరుగా దుకాణాల్లో పంపిణీ చేస్తున్నడంతో దుకాణాలు అన్నింటికీ ఈ బయోమెట్రిక్ పరికరాలు లేవు. ఒకేసారి అన్ని రేషన్ షాపుల్లో పంపిణీ చేయడానికి సాధ్యపడటం లేదు. ఒక్కో రోజు ఒక్కో షాపులో మాత్రమే పంపిణీ చేస్తున్నారు. దీంతో లబ్ధిదారులు ఒకే దుకాణం వద్దకు చేరడంతో పంపిణీలో జాప్యం జరుగుతోంది. చాలా చోట్ల దుకాణాలు కూడా లేకుండా ఉండడంతో ఎప్పుడు వేస్తారో ఎప్పుడు వేయరో కూడా అర్థం కావడం లేదు.

ఇళ్లవద్దనే పంపిణీ చేయాలి

రేషన్ పంపిణీ ముందు పద్ధతిలోని ఎండియు వాహనాలు ద్వారా పంపిణీ చేయాలి. దుకాణాల్లో పంపిణీ చేయడం ద్వారా నిరుపేదల రేషన్ కోసం పనులు వదులుకుని రోజంతా వేచి చూసే పరిస్థితులు ఉన్నాయి. పాత విధానంలోనే పంపిణీ చేపడితే ఇబ్బందులు ఉండవు.

రామిరెడ్డి, సిపిఎం నగర కార్యదర్శి.

గతంలో ఎండియు వాహనం ద్వారా రేషన్ తీసుకుంటున్న లబ్ధిదారులు(ఫైల్ఫోటో)

అర్జీలను పరిష్కరించకుంటే చర్యలు

అధికారులకు కలెక్టర్ హెచ్చరిక

ప్రజాశక్తి-గుత్తి

పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఎవరైనా ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారిపై విచారణ చేసి తక్షణ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డా.వి.వినోద్కుమార్ హెచ్చరించారు. గుత్తి పట్టణం ఆర్ఎస్ రోడ్ వసుధ ఫంక్షన్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఓ ఎ.మలోలతో పాటు జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి 490 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంపై జిల్లా స్థాయి అధికారులతో పాటు మండల, గ్రామస్థాయి అధికారులు దృష్టి సారించాలన్నారు. తాను క్షేత్ర స్థాయి పర్యటనలకు వచ్చినప్పుడు పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారం కాలేదని ఎవరైనా అర్జీదారుడు ఫిర్యాదు చేస్తే సంబంధిత ఉద్యోగిని ఎటువంటి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, రామ్మోహన్, మల్లికార్జున, ఆనంద్, అనంతపురం, గుంతకల్ ఆర్డీవోలు కేశవనాయుడు, శ్రీనివాస్, వ్యవసాయ శాఖ జెడి ఉమా మహేశ్వరమ్మ, జెడ్పీ డిప్యూటీ సీఈవో రామసుబ్బయ్య, డిసిఓ అరుణకుమారి, గుత్తి తహశీల్దార్ ఓబులేసు, ఎంపీడీవో ప్రభాకర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ ప్రాంతాలు శుభ్రంగా ఉండాలి : కలెక్టర్

ఆర్టీసీ బస్టాండు, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆర్టీసీ అధికారులను కలెక్టర్ డా.వి.వినోద్ కుమార్ ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్టాండ్, డిపో పరిసర ప్రాంతాలను తనిఖీ చేశారు. ప్రతిరోజూ ఉదయం తోపాటు మధ్యాహ్నం మూడున్నర గంటల నుంచి నాలుగున్నర గంటల వరకు ఆర్టీసీ అధికారులు దగ్గర ఉండి పారిశుధ్య కార్యక్రమాలను సంబంధిత సిబ్బందితో నిర్వహింపజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుంతకల్ ఆర్డీవో శ్రీనివాస్, తహశీల్దార్ ఓబులేసుతో పాటు ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

4న అనంతపురం-బెంగళూరు రైలు ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం- బెంగుళూరు మార్గం ద్వారా నడిచే నూతన రైలు ఈ నెల 4వ తేదీన ప్రారంభం కానుంది. బుధవారం మధ్యాహ్నం 1:30 గంటలకు అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ అనంతపురం రైల్వే స్టేషన్లో దీనిని ప్రారంభించనున్నారు. ఈ రైలు అనంతపురం నుంచి ప్రతిరోజూ మధ్యాహ్నం 2:10 గంటలకు బయలుదేరి బెంగళూరుకు వెళ్తుంది. రూ.50 టికెట్ ధరతో బెంగళూరుకు ప్రయాణికులు ఈ రైలు ద్వారా చేరుకోవచ్చు. ఈ రైలు ప్రారంభంతో ఉమ్మడి అనంతపురం ప్రాంత ప్రజలకు ప్రయాణ సౌలభ్యం కల్పించడంతో పాటు ఆర్థిక, సామాజిక అభివృద్ధికి దోహదపడనుందని ఎంపీ అంబిక తెలిపారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో వెబ్ డిజైనర్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణకు నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగులు ఈ నెల 7వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఇన్ఛార్జి ప్రిన్సిపల్ వైఎస్ శ్రీధర్, స్కిల్ డెవలప్మెంట్ అధికారి పి.వెంకట ప్రతాపరెడ్డి తెలిపారు. 2 లేదా 3 నెలలు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్తో పాటు ఉపాధి అవకాశాలు కల్పించడమే స్కిల్ హబ్ ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, బీటెక్, డిప్లొమా పూర్తి చేసిన వారు అర్హులన్నారు. వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ భారతి 9440661900, 9010965230కు సంప్రదించాలన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి సోమవారం ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ బద్దే నాయక్ ఆర్థికసాయం చేశారు. శెట్టూరు మండలంలోని అనుంపల్లి గ్రామానికి చెందిన రామాంజ నేయులు, అనితమ్మ దంపతుల కూతురు హేమలత పదో తరగతిలో 568 మార్కులతో ఉత్తీర్ణత సాధించి కర్నూలు జిల్లాలోని బనవాసి జూనియర్ కళాశాలలో సీటు సాధించింది. వారి ఆర్థిక పరిస్థితి తెలియడడంతో బద్దే నాయక్ కళాశాల అడ్మిషన్ ఫీజు రూ. 5వేలతో పాటు రవాణా ఖర్చులకు కలిపి రూ. 10వేలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రాము, చిరంజీవి, మహేష్ పాల్గొన్నారు.

సేవ్ ఆర్డిటి ర్యాలీ

ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ బద్దేనాయక్ ఆధ్వర్యంలో సోమవారం ‘సేవ్ ఆర్డిటి’ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని పాలవాయి గ్రామం నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని వాల్మీకి సర్కిల్, టి సర్కిల్ మీదుగా సాగింది. బద్దేనాయక్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఆర్డిటికి ఎఫ్సిఆర్ఎను రెన్యువల్ చేయాలని కోరారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న వారికి పట్టణంలోని ఎస్ఆర్ గ్రాండ్ హోటల్ భోజనం ఏర్పాటు చేశారు. ర్యాలీలో ఎమ్మార్పీఎస్ నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

లో వోల్టేజీ సమస్యపై ఫిర్యాదు

ప్రజాశక్తి-కుందుర్పి

మండలంలోని మందలపల్లి గ్రామంలో విద్యుత్ కష్టాలు తీవ్రమయ్యాయని సర్పంచి హసీనాబీ అతావుల్లా ఆధ్వర్యంల రైతులు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ మందలపల్లి గ్రామంలో వోల్టేజీ సమస్య ఉందని ఇప్పటికే పలుమార్లు అధికా రులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. లో వోల్టేజీ సమస్యల వల్ల వ్యవసాయ మోటార్లు ఆడక రైతులు, గ్రామంలో తాగునీరు సక్రమంగా సరఫరా కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్పంచి తెలిపారు. ఇకనైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి లో వోల్టేజీ సమస్యను పరిష్కరించడంతో పాటు ప్రత్యేకంగా లైన్మెన్ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

కూడేరులో తాగునీటికి కటకట

ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు

ప్రజాశక్తి-ఉరవకొండ

కూడేరులో తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది. బీసీ, పోస్ట్ ఆఫీస్, ఎస్సీ కాలనీలు, బస్టాండ్ ప్రాంతంలో గత నెల రోజుల నుంచి తాగడానికి నీళ్ల లేక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. నీటి సమస్య తీవ్ర కావడంతో పలు కాలనీల మహిళలు సోమవారం ఉదయం కూడేరు ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. వీరి ఆందోళనకు సిపిఎం మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి, రైతుసంఘం జిల్లా కోశాధికారి రాయుడు మాట్లాడుతూ నెల రోజులు నుంచి కూడేరు మండల కేంద్రంలో నీటి సమస్య ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. నీటి సరఫరాకు నాలుగు బోర్లు ఉన్నా వాటి నిర్వహణ సరిగా లేకపోవడంతో నీటి సమస్య నెలకొందన్నాఉ. ఎస్సీ కాలనీలో మోటారుకు విద్యుత్ కనెక్షన్ లేదన్నారు. బస్టాండ్ ఏరియాలో మోటారుకు పైప్లైన్ మరమ్మతులు చేయాలన్నారు. స్టేట్ బ్యాంక్ ఎదురుగా ఉన్న రెండు మోటార్లను మరమ్మతులు చేయించి నీళ్ల వదలడానికి ఒక వాటర్ మ్యాన్ను నియమించాలన్నారు. బీసీ కాలనీకు కొత్త బోరు వేయాలన్నారు. మహిళల ఆందోళన విషయం తెలుసుకున్న సిఐ రాజు జోక్యం చేసుకుని వారితో మాట్లాడారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, సంగప్ప, రాము, పలు కాలనీల మహిళలు పాల్గొన్నారు.

డ్రోన్ ఆపరేటర్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

డ్రోన్ ఆపరేటర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. పట్టణంలోని ప్రజావేదికలో సోమవారం ఎమ్మెల్యే పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం యావత్తు ప్రపంచంలో డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానం గురించే చర్చ జరుగుతుందన్నారు. తనకున్న పరిచయాలతో ఓ డ్రోన్ కంపెనీని సంప్రదించగా డ్రోన్ ఆపరేటర్లుగా 50 మందికి అవకాశం ఇస్తామని తెలిపిందన్నారు. కంపెనీ ప్రతినిధులే డ్రోన్ ఆపరేటింగ్లో శిక్షణ ఇచ్చి ఆ తర్వాత వారి సేవలు ఉపయోగించుకుంటారన్నార. నెలకు రూ. 18 వేల వేతనం, అలవెన్స్ రూ. 3 వేలు, ఉండటానికి వసతి, భోజనం కంపెనీనే భరిస్తుందన్నారు. ఉద్యోగం ఆంధ్ర, తెలంగాణలో కంపెనీ నిర్దేశించిన ప్రాంతాల్లో పని చేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు పట్టణంలోని ప్రజావేదిక వద్ద బుధవారం నుంచి నాలుగు రోజుల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

హామీలు మరచి.. భారాలా..?

◆ సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం
◆ పన్నుల భారాలు వేస్తే ప్రతిఘటిస్తాం
◆ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబురావు

ప్రజాశక్తి-గుంతకల్లు

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను మరచి, ప్రజలపై పన్నుల భారాలు వేస్తూ పాలన సాగిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సిహెచ్.బాబురావు విమర్శించారు. ప్రజలపై పన్నులు భారాలు తగ్గించాలని, ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం గుంతకల్లు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ధర్నా నిర్వహించారు. గుంతకల్లు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో బాబురావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమాన్ని అమలు చేయకపోగా పన్నుల భారాలు మోపి సామాన్యుల నడ్డివిరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్తి విలువ ఆధారిత కాకుండా పాత పద్ధతిలోనే పన్నులను వసూలు చేయాలన్నారు. ప్రభుత్వం అనుకున్నట్లు ఆస్తి పన్నులు 15 శాతం పెంచితే అనంతపురం జిల్లా ప్రజలపై రూ.12.30 కోట్లు అదనపు భారం పడుతుందన్నారు. రాష్ట్రాన్ని అదానీప్రదేశ్గా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్లు అదానీ భజన చేస్తున్నారని విమర్శించారు. ఇళ్లకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసేందుకు వస్తే ప్రజలు తిరగబడాలని పిలుపునిచ్చారు. గుంతకల్లు ప్రాంతంలో సిఐటియు కాలనీలో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇళ్లపట్టాలివ్వాలని 30 ఏళ్లుగా ఆందోళన చేస్తున్నా అధికారులు కుంటి సాకులు చెబుతుండడం విచారకరం అన్నారు. పట్టణ శివారు కాలనీల్లో రోడ్లు, మురికి కాలువలు, వీధి దీపాలు, తాగునీరు కుళాయిలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆ సమస్యలను పరిష్కరించాలన్నారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులను పెంచాలన్నారు. అనంతరం సిపిఎం పట్టణ కమిటీ బృందం గుంతకల్లులో గత ఆరు రోజులుగా వార్డుల్లో నిర్వహించిన ప్రజాపోరు యాత్రలో ప్రజల నుంచి సేకరించిన సమస్యలను వినతి పత్రాల రూపంలో కమిషనర్ నయీమ్ అహ్మద్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం అనంతపురం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, సీనియర్ నాయకుడు డి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతీ ప్రసాద్, కార్యదర్శివర్గ సభ్యులు కసాపురం రమేష్, రాము నాయక్, ఐద్వా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రంగమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

గుంతకల్లులో మున్సిపల్ కమిషనర్కు వినతిపత్రం అందజేస్తున్న బాబురావు, సిపిఎం నాయకులు

ఆస్తి పన్ను పెంపును వ్యతిరేకిద్దాం

అనంతపురం కలెక్టరేట్ : ఆస్తి పన్ను పెంపునకు ప్రభుత్వం చేపట్టిన సర్వేను ప్రజలు వ్యతిరేకించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సిహెచ్.బాబురావు పిలుపునిచ్చారు. ‘సంస్కరణలు-ప్రజలపై భారాలు’ అన్న అంశంపై సోమవారం సాయంత్రం అనంతపురం గణేనాయక్ భవన్లో సిపిఎం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ మధ్య సుమారు రూ.18 వేల కోట్లకుపైగా రాష్ట్ర ప్రజానీకంపై విద్యుత్ సర్దుబాటు పేరుతో, విద్యుత్ చార్జీలు పెంచారన్నారు. గత ఎన్నికలకు ముందు ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, రైతులకు బిగిస్తున్న స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని పిలుపునిచ్చారన్నారు. అధికారంలోకి రాగానే విద్యుత్ ఛార్జీలు పెంచి, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అందరూ కలిసి అదానీ దాసోహం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్తి పన్ను పెచటం కోసం రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వే చేస్తోందని, దీనిని సిపిఎం అడ్డుకుంటుందని హెచ్చరించారు. ప్రజలందరినీ కలుపుకుని రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున విద్యుత్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్లపై, ఆస్తి పన్ను పెంపునకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, సిటిజెన్స్ ఫోరమ్ నాయకులు, ఎజి.రాజమోహన్, సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ముత్తుజ, వెంకటనారాయణ, ప్రకాష్, గోపాల్, మసూద్, ఇర్ఫాన్, నగర కమిటీ సభ్యులు బుల్లె రాజు, ఎన్టీఆర్ శ్రీనివాసులు, లక్ష్మీ నరసమ్మ, లక్ష్మీనారాయణ, ఎర్రిస్వామి, మెడికల్రెప్స్ నాయకులు శ్రీనివాసరావు, నాయకులు రామాంజి, కుమార్ పాల్గొన్నారు.

4న ‘ఆర్డిటి పరిరక్షణ’ పాదయాత్ర

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

మాజీ ఎంపి, నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త తలారి రంగయ్య ఈ నెల 4వ తేదీ ప్రారంభి స్తున్న ‘ఆర్డిటి పరిరక్షణ’ పాదయాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలో సోమవారం వారు మాట్లాడుతూ రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్(ఆర్డిటి)కు ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్(ఎఫ్సిఆర్ఎ)ను వెంటనే రెన్యువల్ చేయాలని డిమాండ్ చేస్తూ తలారి రంగయ్య బెళుగుప్ప మండలంలోని గొంచితండా నుంచి కళ్యాణదుర్గం వరకూ 62 గ్రామాల మీదుగా 209 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమూర్తి, మండల కన్వీనర్ సూరి, మురళి, కిరిటీయాదవ్, వైస్ ఎంపిపి లక్ష్మీకాంతమ్మ, రాజు పాల్గొన్నారు.

కుందుర్పి : నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త తలారి రంగయ్య ఈ నెల 4వ తేదీ ప్రారంభి స్తున్న ‘ఆర్డిటి పరిరక్షణ’ పాదయాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ హనుమంతరాయుడు కోరారు. ఆయన మాట్లాడుతూ ఆర్డిటి సంస్థను ఉద్దేశపూర్వకంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయని మండిపడ్డారు. ఆర్డిటికి ఎఫ్సిఆర్ఎను రెన్యువల్ చేయాలని కోరుతూ మాజీ ఎంపీ తలారి రంగయ్య చేపడుతున్న పాదయాత్రలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అలాగే కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకపోవడంతో వైసిపి ఆధ్వర్యంలో చేపట్టనున్న వెన్నుపోటు దినంను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలా నాగరాజు, వైస్ ఎంపీపీ భీమిరెడ్డి, సర్పంచులు మారుతీశ్వరరామ్మూర్తి, గంగాధర, హసీనాబీ అతావుల్లా, వరలక్ష్మీవెంకటేశు లు, ఎంపీటీసీ బసవరాజు, మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి, నాయకులు సుదర్శన్రెడ్డి, పాలాక్షి, లింగప్ప, ఎఆర్.వన్నూరురెడ్డి, విజయ్కుమార్, ఎస్.బాబు, తిప్పేస్వామి, నాగలక్ష్మి, మర్రిస్వామి పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తహశీల్దార్ నాగ రాజుకు వినతిపత్రం ఇచ్చారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాల్లో తాగునీరు, లైట్లు, ఫ్యాన్లు, తదితర మౌలిక వసతులు కల్పించాలని, నాణ్యమైన ఆహారం అందించాలని కోరారు. బకాయి మెస్, కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న వార్డెన్, కుక్, అటెండర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తరుణ్, అభి, మనోజ్, వినయ్, మహేంద్ర, భాను, తదితరులు పాల్గొన్నారు.

బహుగ్రంథ రచయిత రమేష్ నారాయణ

పుస్తకావిష్కరణలో ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం

విభిన్న అంశాలపై ప్రతిభావంతమైన రచనలు చేసిన విశ్రాంత ప్రిన్సిపాల్ పతికి రమేష్ నారాయణ బహుగ్రంథ రచయిత అని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ప్రశంసించారు. మహమ్మద్ ప్రవక్త జీవితం గురించి రమేష్ నారాయణ రచించిన పుస్తకాన్ని రాష్ట్ర ముతవల్లిల సంఘం అధ్యక్షులు కెఎం షకీల్ షఫీతో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో బహుముఖ ప్రజ్ఞాశాలిగా రమేష్ నారాయణ కీర్తి గడించారన్నారు. విద్య, సాహిత్య, సామాజిక, సాంస్కృతిక, చారిత్రక రంగాలపై రమేష్ నారాయణకు లోతైన అవగాహన ఉందన్నారు. 75 సంవత్సరాల వయసులో కూడా నిత్య చైతన్యశీలిగా సామాజిక బాధ్యతను నెరవేరుస్తుండటం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్బోర్డు మాజీ సభ్యులు కెఎం సఫీవుల్లా, పలువురు ముతవల్లిలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

విలేకరులు కావలెను
ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు క్రింది తెలిపిన మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.
అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యల పట్ల అవగాహన
-: విలేకరులు కావలసిన ప్రాంతాలు :-
అనంతపురం జిల్లా: కూడేరు, వజ్రకరూర్, ఉరవకొండ రూరల్, కంబదూరు, అనంతపురం, విడపనకల్లు, శెట్టూరు
ఇంటర్వ్యూ : తేది: 11-06-2025 బుధవారం ఉదయం 10 గంటలకు
ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయం,
D.No: 42/2, Near Industrial Estate, Old VRL Transport Godown, Bellary Road, Ananthapuramu
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు : 9490099311,9490099312,313

9న రైతులతో దీక్ష

హంద్రీనీవా లైనింగ్ పనులు ఆపాలి - తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

విలేకరులతో మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు

హంద్రీనీవా కాలువలో లైనింగ్ పనులు చేయడాన్ని నిరసిస్తూ ఈనెల 9వతేదీన వేలాదిమంది రైతులతో మండలంలోని తోపుదుర్తి గ్రామంలో దీక్ష చేపట్టనున్నట్లు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు సోమవారం మండలంలోని పంపనూరు గ్రామం వద్ద హంద్రీనీవా కాలువలో చేపట్టిన కాంక్రీట్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హంద్రీనీవా కాలువలో కాంక్రీట్ బెడ్డింగ్ వేయడం వల్ల భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోతాయన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన రోజుల్లో హంద్రీనీవా అనేది కాంట్రాక్టర్లకు స్వర్గధామంలా మారిపోతుందన్నారు. ఇకపోతే టిడిపి అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ కరువును వరంగా భావిస్తారన్నారు. కాలువలో లైనింగ్ వేయకపోతే కాలువ దిగువన 10 కిలోమీటర్ల మేరకు భూగర్భజలాలు పెరిగి రైతులు పంటలు పెట్టుకునే అవకాశం ఉండేదన్నారు. పాత బోర్లన్నీ రీఛార్జ్ అయ్యేవన్నారు. లైనింగ్ పనులు చేస్తే భూగర్భజలాలు అడుగంటి రైతులు నాశనం అవుతారన్నారు. వెంటనే లైనింగ్ ఆపాఈలని 9న చేపట్టనున్న నిరాహార దీక్షకు రైతులు, ప్రజలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

'ప్రజాపంపిణీ' నిర్వీర్యానికే నగదు బదిలీ

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కృష్ణమూర్తి

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

రేషన్ సరుకుల ప్రజాపంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నగదు బదిలీ విధానాన్ని ప్రవేశపెడుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కృష్ణమూర్తి, ఉరవకొండ మండల కన్వీనర్ మధుసూదన్ మండిపడ్డారు. ఈమేరకు సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఉరవకొండ తహశీల్దార్ మహబూబ్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేషన్ సరుకుల వద్దనుకుంటే నగదు బదిలీ ఇస్తామని సిఎం ప్రకటించడాన్ని సిపిఎంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ నిర్ణయం ప్రజా పంపిణీ వ్యవస్థను నీరుగార్చడానికి దారి తీస్తుందన్నారు. నగదు విధానం బదిలీ పేరుతో పేద ప్రజల కడుపు కొట్టవద్దని ముఖ్యమంత్రిని కోరారు. రేషన్‌షాపుల ద్వారా తీసుకుంటున్న బియ్యం అమ్ముకుంటున్నారనే పేరుతో దొడ్డిదారిన నగదు బదిలీ పథకాన్ని ప్రవేశపెట్టడాన్ని సిపిఎం వ్యతిరేకిస్తోందన్నారు. నగదు బదిలీ ప్రవేశపెట్టడం అంటే ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రజల నుండి దూరం చేయడమే అన్నారు. మార్కెట్లో బియ్యం ధరలు పెరిగిన ప్రభుత్వం ఇచ్చే నగదు మాత్రం పెరగదన్నారు. ప్రభుత్వ విధానాలతో పేద ప్రజలు నష్టపోతారన్నారు. పేదలకు ఇచ్చే నగదుతో బయటి మార్కెట్లలో వచ్చే సరుకులు పరిమితంగా ఉంటాయి కాబట్టి రేషన్ సరుకులు బదులు నగదు ఇచ్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మురళీ, రవికుమార్, వీరాంజనేయులు, సిద్ధప్ప, తదితరులు పాల్గొన్నారు.

'వెన్నుపోటు దినాన్ని' విజయవంతం చేయండి

వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

ఈనెల 4వ తేదీన నియోజకవర్గ కేంద్రాల్లో జరిగే వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, వైసిపి అనంతపురం పార్లమెంటు పరిశీలకుడు నరేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని కెఎం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశం వారు మాట్లాడుతూ కూటమి ఏడాది పాలనలో ప్రచార అర్భాటమే తప్ప ఏమీ లేదన్నారు. కూటమి ప్రభుత్వం వ్యవస్థలను అడ్డుపెట్టుకొని అరాచకాలను చేస్తోందన్నారు. చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సంక్షేమం లేదని అభివృద్ధి జాడ కానరాలేదన్నారు. అనంతరం వెన్నుపోటు దినానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, వైస్ ఛైర్‌పర్సన్ బి.వరలక్ష్మి, ఎంపిపి జి.విశాలాక్షి, వైసిపి పట్టణ, మండల కన్వీనర్లు కె.మధుసూదన్‌రెడ్డి, జి.గంగరాజు, నాయకులు డి.హుస్సేన్‌పీరా, జి.గోవర్ధన్‌రెడ్డి, బి.గురుప్రసాద్‌యాదవ్, సివి రంగారెడ్డి, మల్లయ్యయాదవ్, ప్రవీణ్‌కుమార్ యాదవ్, వై.రామసుబ్బారెడ్డి, ఎం.రంగస్వామి, నూర్‌నాయక్, మల్లికార్జున, కౌన్సిలర్లు వి.వరదరాజులు, వాల్మీకి శివ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : కలెక్టర్

యోగాసనాలు వేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-గుత్తి

ప్రతిఒక్కరూ యోగాసనాలు వేయాలని తద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సూచించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక గుత్తి కోటలోని గుర్రపుశాల వద్ద ఏర్పాటు చేసిన యోగాలో కలెక్టర్ పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చారిత్రాత్మక గుత్తి కోటలో యోగా కార్యక్రమం చేపట్టడం ఆనంద దాయకమన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని వచ్చే ఏడాది జనవరిలో గుత్తి కోట ఉత్సవాలకు ప్రభుత్వం రూ.50 లక్షలు నిధులు మంజూరు చేసిందన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ బి.జబ్బర్ మియా, యోగా గురువు కృష్ణయ్య, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు సి.విజయభాస్కర్‌ను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ, తహశీల్దార్ డి.ఓబులేసు, ఎంపిడిఒ డి.ప్రభాకర్‌నాయక్, ఉప తహశీల్దార్ కె.సూర్యనారాయణ, ఆర్ఐ సందీప్, ఆయుష్ శేఖర్ చెందిన యోగా గురువులు గురు రాజారావు, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో 'నారాయణ' ప్రతిభ

నారాయణ విద్యాసంస్థల కోర్ డీన్ బికె బద్రీనాథ్

విజయకేతనం చూపుతున్న విద్యార్థులు, నారాయణ విద్యాసంస్థల ప్రతినిధులు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ప్రతిష్టాత్మక జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో అనంతపురం నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను చూపడం జిల్లాకే గర్వకారణమని విద్యాసంస్థల కోర్ డీన్ బికె బద్రీనాథ్ అన్నారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ కళాశాలకు చెందిన భూపతి నితిన్ అగ్నిహోత్రి జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో 360 మార్కులకు 264 మార్కులు సాధించి అఖిలభారత స్థాయిలో ఓపెన్ కేటగిరీలో 183 ర్యాంక్ సాధించి జిల్లాకే గర్వకారణమయ్యాడు. ప్రతిష్టాత్మక ఐఐటీల్లో సీట్ల కోసం నిర్వహించే ఈ పోటీ పరీక్షల్లో 12.68 లక్షల మంది పరీక్ష రాయగా 2.5 లక్షల మంది అర్హత సాధించారన్నారు. ఇందులో నారాయణ విద్యార్థులు అఖిల భారత స్థాయిలో ఓపెన్ కేటగిరీలో పి.విశాల్ 3946 (ఒబిసిఎన్‌సిఎల్ 735) ర్యాంకు, భావన 10889 ర్యాంకు, మోక్ష సాయిరెడ్డి 12809 (ఈడబ్ల్యూఎస్ ర్యాంకు 1673) ర్యాంకు, ఆసీఫ్ 16099 (ఓబీసీఎన్‌సిఎల్4068) ర్యాంకు, సవిత్‌కుమార్‌రావు 16884 ర్యాంకు, డి.లోకేష్ కుమార్ 114 (ఎస్సీ) ర్యాంకు, ప్రణయ్‌చౌదరి 5499 (ఈడబ్ల్యూఎస్) ర్యాంకు సాధించి జిల్లాలో అత్యుత్తమ ప్రతిభను చాటారన్నారు. విద్యార్థులందరికీ నేరుగా ఐఐటీలో ఇంజనీరింగ్ సీట్లు వస్తాయన్నారు. నారాయణ విద్యాసంస్థల కరికులం, అత్యుత్తమ బోధన, నిరంతర పర్యవేక్షణ చేసే అధ్యాపక బృందం, విద్యార్థుల పట్టుదల, శ్రమ మరియు తల్లితండ్రుల ప్రోత్సాహంతో ఈ ఫలితాలు సాధించడానికి సాధ్యమైందని తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులు, బోధన చేసిన అధ్యాపక బృందానికి కోర్ డీన్ బికె బద్రీనాథ్, డిజిఎం వెంకటరామిరెడ్డి, ప్రిన్సిపాళ్లు రవిశంకర్‌రెడ్డి, ఓబన్నగౌడ్, సిబ్బంది అభినందనలు తెలిపారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా జి.కవిత

శింగనమల : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జి.కవిత సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ షఫీ ఉద్యోగ విరమణ చేశారు. దీంతో అనంతపురం ప్రభుత్వ కెఎస్ఎన్ జూనియర్ కళాశాలలో బోటనీ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న కవిత ఇక్కడికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు తెలిపారు. మండలంలోని గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు మధ్యాహ్నం భోజన సదుపాయం ఉందన్నారు. బాలికలకు నూతన ప్రభుత్వ వసతిగృహం ఉందన్నారు.

పొగాకు రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

అనంతపురం : పొగాకు రహిత సమాజాన్ని నిర్మిచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా పొగాకు నియంత్రణ సామాజిక కార్యకర్త బి.శ్రీరాములు పిలుపునిచ్చారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ మాసోత్సవాల్లో భాగంగా సోమవారం పాలిటెక్నిక్ కళాశాల క్రీడా మైదానంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం పొగాకు, వాటి ఉత్పత్తులకు దూరంగా ఉంటామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియు అధ్యాపకులు, సిబ్బంది, బ్యాంకు ఉద్యోగులు, తపాలా కార్యాలయ సిబ్బంది యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు 'అన్నదాత సుఖీభవ' ఇవ్వాలి

జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, బాలరంగయ్య

ధర్నాలో మాట్లాడుతున్న కౌలు రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా అన్నదాత సుఖీభవ పథకం కింద ఇచ్చే రూ.20వేలను కౌలు రైతులకు అందజేయాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, బాలరంగయ్య డిమాండ్ చేశారు. కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉరవకొండ తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీగా వచ్చి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కౌలు చట్టాన్ని అమలు చేసి ఎలాంటి షరతులు లేకుండా కౌలు రైతులందరికీ సిసిఆర్‌సి కార్డులు ఇవ్వాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు వర్తింపజేయాలన్నారు. అలాగే 90శాతం సబ్సిడీతో విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు ఇవ్వాలన్నారు. వీటితోపాటు కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, రైతుసంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్, కౌలు రైతుసంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సురేష్, నాయకులు రామ్మూర్తి, మండల నాయకులు రవి, మురళి, సుంకన్న, ఆంజనేయులు, పద్మావతి, లక్ష్మమ్మ, కుళ్లాయప్ప, సిద్ధప్ప, ధనుంజయ్య, కౌలు రైతులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

పంటల సంసిద్ధతపై అవగాహన

నార్పలలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-నార్పల

వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని చామలూరు, కేసేపల్లి రైతు సేవకేంద్రాల పరిధిలో ఖరీఫ్ పంటల సాగు సంసిద్ధతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి చెన్న వీరస్వామి భూసార పరీక్ష ఫలితాలు, రాయితీ మీద విత్తన పంపిణీ, రాయితీ వ్యవసాయ యాంత్రీకరణ, అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ వంటి పథకాల అమలుపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ భార్గవి, సీనియర్ శాస్త్రవేత్త రాజన్న, ఎస్ఎంఎస్ చందన, బిటిఎం చంద్రశేఖర్‌రెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రాయోజిత వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం యాడికి, రాయలచెరువు రైతు సేవాకేంద్రాల్లో రైతులకు సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు సుధీర్, కిషోర్, జహీర్‌ఖాన్ ఖరీఫ్ కోసం వేచి ఉన్న రైతులకు సాగులో మెలకువలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పామిడి : మండలంలోని కండ్లపల్లి, ఎద్దులపల్లి గ్రామాల్లో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు లాభసాటి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సుధారాణి, లక్ష్మణ్, మండల వ్యవసాయ మండల అధికారిణి లీనా వసుంధర, డిఆర్‌డిఎ ఎపిఎం నల్లప్ప, బిటిఎం గుత్తి లావణ్య, ఎఇఒ శ్రీనివాసరావు, ఎంపిఇఒ లక్ష్మీనారాయణ, విఎఎ శ్రీకాంత్, రైతులు పుల్లారెడ్డి, శివారెడ్డి, సురేష్, శ్రీనివాస్, సూరి, సుదర్శన్, వెంకట్రామిరెడ్డి, ఇమాములు, వీరాంజనేయులు, రాజు, శ్రీనివాస్‌రెడ్డి, గోవిందరాజులు, పరమేశ్వర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు విరాళం

శింగనమల : మండలంలోని గురుగుంట్ల గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆవిష్కరణకు తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు సోమవారం రూ.10వేలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బండి పరశురామ్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు బెస్త నారాయణస్వామి, రంగస్వామి, సోమశేఖర్, పెద్దన్న, కేశవ, తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో వైద్యశిబిరం

గుమ్మగట్ట : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కర్నూలు శాంతిరామయ్య ఆసుపత్రి సౌజన్యంలో సర్పంచు విజయలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం కంటి, గుండె వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మండలంలోని 15 పంచాయతీల్లోని దాదాపు 150 మంది వరకూ గుండె పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు డాక్టర్ రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలాజీ, డాక్టర్ రామ్‌కిషోర్, డాక్టర్ సందేశ్, శాంతిరామయ్య, టిడిపి కాలవ సన్నన్న, మండల కన్వీనర్ గిరి మల్లప్ప, సదాశివ, వీరాపురం సర్పంచు నాగరాజు, బేలోడు సంజీవ, ఫైదొడ్డి రాజు, రంగసముద్రం శివ, బిటిపి అంజి, లోకేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

తూము మరమ్మతులు చేయాలని వినతి

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

మండల కేంద్రంలోని రంగరాయలు చెరువు పత్తిమాల తూముకు మరమ్మతులు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ సాకే బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు వృథా కాకుండా పత్తిమాల తూముకు మరమ్మతులు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. అలాగే ఉపాధి హామీ పథకం కింద బీళ్లుగా మారిన పొలాల్లో ముళ్లకంపలను తొలగించాలన్నారు. అలాగే ఖరీఫ్ సీజన్‌లో 90 శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ కాయలు ఇవ్వాలని, అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం రూ.20వేలు రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఇకపోతే ఉపాధి హామీ పథకంలో పెండింగ్ బిల్లులు చెల్లించాలని, సంవత్సరంలో 200 రోజులు ఉపాధి హామీ పనులు కల్పిస్తూ రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎర్రిస్వామి, వెంకటస్వామి, పుల్లయ్య, లక్ష్మీపతి, శ్రీనివాసులు, సుంకన్న, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు కార్మిక చట్టాలు అమలు చేయాలి

బీడీ కార్మికులతో సిఐటియు నాయకులు ఉమా గౌడ్, రామ్మోహన్

ప్రజాశక్తి-తాడిపత్రి

బీడీ కార్మికులకు 1966 బీడీ కార్మిక చట్టం, 1976 బీడీ కార్మిక సంక్షేమ చట్టాలను అమలు చేయాలని సిఐటియు నాయకులు ఉమాగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని లేబర్ ఆఫీసులో బీడీ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో 24 మంది కార్మికులతో ఈ-శ్రమ్ కార్డులను చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బీడీ కార్మికులను గాలికి వదిలేసిందన్నారు. తాడిపత్రిలో 4000 మందికిపైగా బీడీ కార్మికులు ఉన్నా, లేబర్ ఆఫీసు రికార్డుల్లో వారి పేర్లు లేకపోవడం బాధాకరమన్నారు. బీడీ కార్మికులే లేకపోతే బీడీ పరిశ్రమలు, పొగాకు ఉత్పత్తులపై కేంద్రం జీఎస్టీ 28శాతం ఎలా వసూలు చేస్తుందని ప్రశ్నించారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం పార్లమెంటులో బీడీ కార్మికుల సంక్షేమానికి చేసిన వాగ్దానాలు నెరవేర్చలేదన్నారు. కనీసం ప్రతి బీడీ కార్మికుడికీ నెలకు రూ.3వేల జీవనభృతి కల్పించాలని, పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని, పొగాకు ఉత్పత్తులపై జీఎస్టీ ద్వారా వచ్చే ఆదాయాన్ని విద్య, వైద్యం, ఆరోగ్యం, ఉపాధి, సంక్షేమం కోసం ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ పట్టణ కార్యదర్శి రామ్మోహన్, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

శింగనమల : పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పిహెచ్‌సి డాక్టర్ శంకర్‌నాయక్ సూచించారు. సోమవారం మండలంలోని చక్రాయపేట గ్రామంలో మలేరియా నివారణ మాసోత్సవం సందర్భంగా మలేరియాపై అవగాహన ఫ్రైడే డ్రైడే, ఆవశ్యకత, దోమలు పుట్టకుండా కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారాయణ, మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సిబ్బంది శ్రీధర్‌మూర్తి, అశ్వర్థనారాయణ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఉమాదేవి, సచివాలయ సెక్రటరీ వినతి, ఆరోగ్య కార్యకర్తలు విజయకుమార్, హేమలత, ఆశా కార్యకర్తలు సుభాషిని, పెద్దక్క, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం తగదు

ఉరవకొండ : దేశంలో మరోమారు కరోనా పడగ విప్పుతుంటే రాష్ట్రంతోపాటు జిల్లాలో ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు పాటించకుండా ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం వహించడం తగదని శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. ఆరోగ్యశాఖ మంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న జిల్లాలోనే ప్రజల ఆరోగ్యంపై ఇంతటి నిర్లక్ష్యం ఉందంటే రాష్ట్రంలో మిగిలిన జిల్లాల్లో పరిస్థితి ఎంత మాత్రం ఉంటుందో ఊహించుకోవాలన్నారు. పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర,కేరళ,కర్ణాటక లలో కరోనా వైరస్ కేసులు వందలాదిగా నమోదవుతుండడం, దేశవ్యాప్తంగా నాలుగువేల పైచిలుకు యాక్టివ్ కేసులు ఉంటే రాష్ట్రంలో కనీసపు ముందస్తు జాగ్రత్తలు కూడా వైద్య ఆరోగ్యశాఖ తీసుకోకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని కరోనా వైరస్ నివారించడానికి ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రైతుకు పరామర్శ

రైతులను పరామర్శిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

అనంతపురంలోని సాయినగర్ 8వ క్రాస్‌లో ఉన్న శుకృత ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రైతును పట్టణంలోని ఎస్ఎస్ పల్లికి చెందిన వైసిపి మాజీ జిల్లా ఉపాధ్యక్షురాలు చంద్రగిరి రాధాయాదవ్ సోమవారం పరామర్శించారు. గుంతకల్లు మండలం అయ్యావారిపల్లికి చెందిన కోవెలదిన్నె వెంకటేసులు ఇటీవల ద్విచక్ర వాహనంలో వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఆసుపత్రిలో శస్త్ర చికిత్స అనంతరం ఆసుపత్రిలో ఉన్న రైతును పరామర్శించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని నింపారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

నోటీసు
మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
ఎ.యస్. నెం.159/2024

బిట్వీన్
Kolakaluri Jyothi ... అప్పిలెంట్ / 1వ ప్రతివాది
ఎదిరి
Cherukuri S.V.S. Subba Lakshmi and others .... రెస్పాండెంట్స్

To,
R7 : Kondajogula Mani Kumari @ Athota Mani Kumari, W/o Suresh, D.No. 12-5-27, FCI House Board Colony, Ananthapur Post & District.

పై నెంబరు అప్పీలులో మీకు శ్రీ కోర్టు మరియు పోస్టు ద్వారాను నోటీసులు పంపించినను మీరు తీసుకోనందున ఈ ప్రకటన ద్వారా నోటీసు నిమిత్తం శ్రీ కోర్టువారు ఆర్డరు వేస్తూ మీ హాజరు కొరకు ది. 16-6-2025 తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల సదరు అప్పీలును మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వాయిదాతేది : 16-6-2025

పి. భూషణం,
అప్పిలెంట్ తరఫు అడ్వకేట్,
తెనాలి. సెల్ : 9849575998.

4న 'వెన్నుపోటు దినం'

మాజీ మంత్రి శైలజనాథ్

పుట్లూరు : మండల కేంద్రంలోని ఎంపిపి రాఘవరెడ్డి నివాసం వద్ద వెన్నుపోటు దినానికి సంబంధించిన పోస్టర్లను నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా శైలజానాథ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేయడానికి నిరసిస్తూ ఈనెల 4వతేదీన నార్పల మండల కేంద్రంలో వెన్నుపోటు దినం నిర్వహించి నిరసన తెలియజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాఘవరెడ్డి, సర్పంచులు మహేశ్వర్‌రెడ్డి, రామాంజులరెడ్డి, రవిచంద్రారెడ్డి, రామాంజనేయులు, నాయకులు వెంకటరామిరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, రమణారెడ్డి, బండ్లపల్లి ప్రతాపరెడ్డి, మాజీ సర్పంచు కాటమయ్య, తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా సబ్‌రిజిస్ట్రార్ భార్గవ్

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

గుత్తి : గుత్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జిల్లా సబ్ రిజిస్ట్రార్ భార్గవ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. విధులను బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ మంజునాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

నార్పల ఎంపిడిఒగా మమతాదేవి



ప్రజాశక్తి-నార్పల

మండల నూతన ఎంపిడిఒగా మమతాదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నార్పల ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తున్న గంగాదేవి సెలవుపై వెళ్లడంతో శింగనమల ఎంపిడిఒ భాస్కర్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో తనకల్లు ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తున్న మమతాదేవి సాధారణ బదిలీల్లో భాగంగా నార్పల రెగ్యులర్ ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయం, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించి మండల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గూగూడు గ్రామానికి వెళ్లి కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఎస్‌కెయు ఆర్ట్స్, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్‌గా డి.ఆంజనేయులు

అనంతపురం : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్, సైన్స్ కళాశాలల ప్రిన్సిపాల్‌గా కామర్స్ విభాగానికి చెందిన ఆచార్యులు డి.ఆంజనేయులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయం అభివృద్ధికి తనవంతు బాధ్యతగా పని చేస్తానన్నారు. ప్రతి ఉద్యోగి సమయపాలన, క్రమశిక్షణతో పని చేసి విశ్వవిద్యాలయ పురోగతికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన యూనివర్సిటీ రెక్టర్ ఆచార్య జీ వెంకట నాయుడు , రిజిస్ట్రార్ ఇ.రమేష్‌బాబు, కృష్ణకుమారి, పిఆర్‌ఒ కె.రాజగోపాల్, తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

జనసేన కార్యకర్తలకు బీమా పరిహారం అందజేత

అనంతపురం కార్పొరేషన్ : ఆపత్కాలంలో ఉన్న కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవాలని ఆవేదన రగల్చిన ఆలోచన నుంచి పుట్టిందే జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ ప్రమాద బీమా కార్యక్రమమని జనసేన జిల్లా అధ్యక్షులు, అహుడా ఛైర్మన్ టిసి వరుణ్ అన్నారు. సోమవారం మంగళగిరి ఆర్ఆర్ కన్వెన్షన్ సెంటర్ వేదికగా జనసేన క్రియాశీలక సభ్యత్వం తీసుకుని పలు ప్రమాదాల్లో మృతిచెందిన 101 మంది కార్యకర్తల కుటుంబాలకు రూ.5.05 కోట్ల ప్రమాద బీమాను వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ జనసేన పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులు నాగబాబు అందజేశారు. అందులో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన హిందూపురం నియోజకవర్గం చిలమత్తూరు మండలం మొరంపల్లి శ్రీనివాసులు, కదిరి నియోజకవర్గం తనకల్లు మండలం గందోడు వారి పల్లి సిమ్మల నరేష్ వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్, హిందూపురం నియోజకవర్గం ఇన్చార్జి ఆకుల ఉమేష్, కదిరి నియోజకవర్గం ఇంచార్జ్ భైరవ ప్రసాద్ సమక్షంలో నాగబాబు రూ 5 లక్షల చొప్పున రెండు కుటుంబాలకు చెక్కులను అందజేశారు.

పరిహారం చెక్కులను అందజేస్తున్న నాగబాబు

మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని వినతి

పుట్లూరు : మండలంలోని చాలివేముల గ్రామంలో ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందిన యువకుడు రాజకుళ్లాయప్ప కుటుంబానికి ప్రభుత్వం రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ఎస్.సూరి కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుడు రాజకుళ్లాయప్పకు తల్లి సరస్వతి, వికలాంగురాలైన చెల్లెలు నల్లమ్మ ఉన్నారన్నారు. రాజకుళ్లాయప్ప మృతితో వీరిద్దరి కుటుంబ పోషణ భారమైందన్నారు. కావున ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సిపిఎం నాయకులు పెద్దయ్య, భూషణ్, బి.భాస్కర్‌రెడ్డి, జి.వెంకటచౌదరి, జె.పెద్దయ్య, టి.ఆదినారాయణ, టి.శ్రీను, టి.రఘువీరా, టి.నారాయణస్వామి, బి.లోకేష్, టి.నందా, టి.వీరప్ప పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో క్లీనర్ మృతి

మహమ్మద్ (పాతచిత్రం)

పెద్దవడుగూరు : మండలంలోని కాశేపల్లి సమీపంలో ఉన్న టోల్‌ప్లాజా వద్ద సోమవారం రెండు మినీ లారీలు ఢీకొన్న ప్రమాదంలో మహమ్మద్ (31) మృతి చెందినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా మాన్వి గ్రామానికి చెందిన ఇతను మినీ లారీకి క్లీనర్ గా వ్యవహరిస్తూ బెంగళూరు ప్రాంతానికి సరుకు తీసుకెళ్తున్న క్రమంలో ఇక్కడికి రాగానే ముందున్న మినీ లారీని ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో క్లీనర్ మహమ్మద్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.